ఓసీపీ 5 ఓబీ పనుల నిలిపివేతతో జీఎం చర్చలు

గోదావరిఖని, సెప్టెంబర్ 26: సింగరేణి ప్రభావిత, పరిసర గ్రామాల నాయకులు జీడీకే ఓసీపీ 5 ఓబీ పనులను 80శాతం స్థానికులకు ఇవ్వాలనే డిమాండ్‌తో ఈ నెల 8 నుంచి పనులు అడ్డుకోవడంతో ఓబీ పనులు నిలిచియాయి. గురువారం ఆర్జీ-1 జీఎం డీ లలిత్‌కుమార్ ఓబీ పనుల పీసీ పటేల్ కంపెనీ ప్రతినిధులు, స్థానిక నాయకులతో చర్చలు జరిపారు. పనులు నిలిపివేతతో సింగరేణి సంస్థకు విఘాతం కలిగిన దృష్ట్యా చర్చలకు ఆహ్వానించారు. రెండు విడుతలుగా సాయంత్రం వరకు చర్చలు నిర్వహించారు. చర్చలు పూర్తికాలేదు. ఈ చర్చలు ఒక కొలిక్కి వచ్చి సఫలం అయ్యే అవకాశాలు ఉన్నట్లుగా సింగరేణి ఆర్జీ-1 అధికార ప్రతినిధి డీ కిరణ్‌బాబు పేర్కొన్నారు.

సెక్యూరిటీగార్డ్ ఆత్మహత్యాయత్నం

ఫర్టిలైజర్‌సిటీ, సెప్టెంబర్ 26: అశోక్‌నగర్‌కు చెందిన షేక్ మసూద్ అనే సిమ్స్ మెడికల్ కళాశాల సెక్యూరిటీగార్డ్ గురువారం మెడికల్ కళాశాల మెయిన్‌గేట్ వద్ద విషం తాగి ఆత్మహత్యకు యత్నించాడు. వెంటనే ప్రభుత్వ జనరల్ దవాఖానకు తరలించారు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం తన తప్పులేకున్నా రెండు నెలలుగా సెక్యూరిటీ గార్డ్ ఉద్యోగంలోంచి తొలగించడంతో కలత చెందినట్లు పేర్కొన్నాడు. సంబంధిత కాంట్రాక్టర్ హైదరాబాద్ నుంచి రాగా ఆత్మహత్యకు పాల్పడినట్లు పేర్కొన్నాడు.

సింగరేణి కార్మికుడు

ఫర్టిలైజర్‌సిటీ, సెప్టెంబర్ 26: పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన జీడీకే 11 ఇంక్లయిన్ కార్మికుడు శంకర్ ఇంటి పక్క వారితో జరిగిన గొడవతో మనస్తాపం చెంది గురువారం విషం తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు సింగరేణి ఏరియా దవాఖానకు తరలించగా చికిత్సపొందుతున్నాడు. శంకర్‌కు ఇంటి పక్క వారితో గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో శంకర్‌పై వారు పోలీసులకు తప్పుడు ఫిర్యాదు చేయడంతో కలతచెందిన శంకర్ ఆత్మహత్యకు యత్నించిట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

గోదావరిలో తాపీమేస్త్రీ గల్లంతు

ఫర్టిలైజర్‌సిటీ, సెప్టెంబర్ 26: పట్టణంలోని చంద్రబాబునాయుడు కాలనీకి చెందిన బాలరాజు అనే తాపీమేస్త్రీ గురువారం గోదావరిలో ప్రమాదవశాత్తు పడి గల్లంతయ్యాడు. ఏపీలోని ప్రకాశం జిల్లా వాలేటి పాడుకు చెందిన బాలరాజు ఇంటి నిర్మాణ పనులు లేకపోవడంతో సరాదగా మరో ఇద్దరు తాపీమేస్త్రీలతో కలిసి గోదావరి సమ్మక్క గద్దెల సమీపంలోని స్నానఘట్టాల వద్దకు వచ్చారు. ప్రమాదవశాత్తు బాలరాజు కాలు జారి గోదావరిలో పడిపోయాడు. మిగితా ఇద్దరు తాపీమేస్త్రీలు రక్షించేందుకు చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి.

కాంట్రాక్ట్ కార్మికులందరికీ లాభాల వాటా చెల్లించాలి

గోదావరిఖని, సెప్టెంబర్ 26: సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులందరికీ లాభాల వాటా చెల్లించాలని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ అనుబంధ సంఘం ప్రగతిశీల సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్, ఐఎఫ్‌టీయూ ప్రతినిధి బృందం కోరింది. ఈ మేరకు గురువారం సింగరేణి డైరెక్టర్(పా) వెంకటేశ్వర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ యాకుబ్ షావలి, రీజియన్ అధ్యక్షుడు ఆర్ మధుసూదన్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి తోకల రమేశ్, పెద్ద బోయిన సతీశ్, నాయకులు ఎదులాపురం గోపాల్‌రావు ఉన్నారు.

సీబీఐ విచారణ చేయాలి

యైటింక్లయిన్‌కాలనీ, సెప్టెంబర్ 26 : కోల్ మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ (సీఎంపీఎఫ్) లో జరిగిన వేయి కోట్ల కుంభకోణంపై సీబీఐ విచారణ చేపట్టాలని బీఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య డిమాండ్ చేశారు. సీఎంపీఎఫ్ కుంభకోణంపై విచారణ చేపట్టి బాధ్యులను శిక్షించాలని కోరుతూ ఆర్జీ-2 జీఎం కార్యాలయం ఎదుట గురువారం ధర్నా చేశారు. డీజీఎం అనిల్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి సారంగపాణి, మాదాసు రవీందర్, వడ్డేపల్లి కుమారస్వామి, ప్రసాద్, రౌతు రమేశ్, మహేశ్, నరేశ్ పాల్గొన్నారు.

బతుకమ్మ చీరలు ఈసారి లేనట్టేనా...?

- పండుగకు మరో వారమే గడువు
- ఎదురుచూస్తున్న మహిళలు

మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ (ఫైల్)

కోల్‌సిటీ, సెప్టెంబర్ 26: తెలంగాణ ఆడపడుచులు ఆనందంగా జరుపుకునే బతుకమ్మ పండుగ రానే వస్తుంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ బతుకమ్మ పండుగను మహిళలు ఆనందంగా జరుపుకోవాలని భావించి ఏటా తీరొక్క చీరలను పంపిణీ చేసింది. కానీ ఈ సంవత్సరం బతుకమ్మ చీరల పంపిణీకి సంబంధించి ఏర్పాట్లు గానీ, సమాచారం లేకపోవడంతో అని మహిళలు ఆవేదన చెందుతున్నారు. పండుగకు మరో వారం మాత్రమే గడువు ఉంది. ఇప్పటివరకు చీరల పంపిణీకి సంబంధించిన ఆ సందడే కనిపించడం లేదు. మహిళలను బాధపెట్టకుండా ఈసారి స్వయం సహాయక సంఘాలతో నగదు బదిలీతో సర్దిచెప్పడానికి ప్రభుత్వం కసరత్తు చేస్తున్నా... అది కూడా ఈ వారంలో సాధ్యమవుతుందా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. రామగుండం కార్పొరేషన్‌లో ఏటా దాదాపు 35వేల వరకు బతుకమ్మ చీరల పంపిణీ చేశారు. ఈ ఏడు చీరలు రాకపోవడంతో మహిళలు నిరుత్సాహానికి గురవుతున్నారు. ఈ ప్రభుత్వానికి బతుకమ్మ చీరలు కూడా భారమయ్యాయా అంటూ ప్రశ్నిస్తున్నారు. నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలకు ప్రత్యేకంగా నిధులు కేటాయించేవారు. ఈయేడు వేడుకలకు సంబంధించి ఏర్పాట్ల విషయంలో ఇప్పటి వరకు నగర పాలక అధికారులకు ఎలాంటి ఆదేశాలు కూడా అందలేదు

పిల్లల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

పెద్దపల్లి కమాన్, సెప్టెంబర్ 26 : పిల్లల ఆరోగ్యంపై తల్లిదండ్రులు, అంగన్‌వాడీ టీచర్లు ప్రత్యేక శ్రద్ధ చూపాలని డాక్టర్ శ్రీహర్ష సూచించారు. పెద్దపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని అంగన్‌వాడీ కేంద్రం-4లో పిల్లలకు వైద్య పరీక్షలు చేశారు. ఇక్కడ అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ప్రేమలత, అంగన్‌వాడీ టీచర్లు మెహరున్నీసా, రేఖ, శ్రీదేవి, ఏఎన్ఎం సునీత, ఆశ కార్యకర్తలు ఉన్నారు.

ధర్మారం,సెప్టెంబర్26: నాయకంపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పోషణ మాసం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్ వైజర్ బ్లాండీనా పోషకాహారంపై అవగాహన కల్పించారు. చిన్నారులకు అన్న ప్రాసన,అక్షరాభ్యాసం చేయించారు. పోషకాహార ప్రతిజ్ఞ చేయించారు. ఆయా కేంద్రాల అంగన్‌వాడీ టీచర్లు ఏదుల్ల దేవేంద్ర, పద్మ, ఉపాధ్యాయులు, తల్లులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో అక్షరభ్యాసం, అన్నప్రాసన

జ్యోతినగర్, సెప్టెంబర్ 26: పీకే రామయ్యకాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో టీచర్ బీ సరిత ఆధ్వర్యంలో పిల్లలకు అక్షరాభ్యాసం, అన్నప్రాసన, గర్భిణులకు సీమంతం నిర్వహించారు. కాంగ్రెస్ డివిజన్ ఇన్‌చార్జి మడిపెల్లి మల్లేశ్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సాదిక్‌పాషా, సూపర్‌వైజర్ వీ సరస్వతీ, పెనుగొండ తిరుపతి ఉన్నారు.

యైటింక్లయిన్‌కాలనీ, సెప్టెంబర్ 26 : పోషన్ మహాన్‌లో భాగంగా ఐసీడీఎఫ్ ఆధ్వర్యంఓ రామగిరి మండలం వెంకట్రావుపల్లిలోని వివిధ అంగన్‌వాడీ కేంద్రాల్లో మెడికల్ క్యాంప్ నిర్వహించారు. డాక్టర్ నిఖిల రాణి పిల్లలకు వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా పిల్లల ఎత్తు, బరువు పరీక్షించి పౌష్టికాహారం అందజేశారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కొప్పుల అనిత, ఎల్‌హెచ్‌డీ సీతారామయ్య, అంగన్‌వాడీ టీచర్స్ వనజారాణి, సరస్వతీ, హేమలత, రమ, ఆశ కార్యకర్త కల్యాణి పాల్గొన్నారు.

సఫాయి మిత్ర సురక్ష శిబిరం

పాలకుర్తి, సెప్టెంబర్26: పుట్నూర్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో గురవారం సఫాయిమిత్ర సురక్ష వైద్యశిబిరం నిర్వహించారు. మండలంలోని 19 జీపీల్లో పనిచేస్తున్న సఫాయి కార్మికులకు పుట్నూర్ ఆరోగ్యకేంద్రంలో అన్నిరకాల వైద్యపరీక్షలు చేయించినట్లు ఎంపీడీవో శశికళ తెలిపారు. ఎంపీవో సుదర్శన్, డాక్టర్ సాయి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

మంథని, సెప్టెంబర్ 26: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. అభయ కార్డులు ఆన్‌లైన్ ఎంటర్ చేసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ పెంద్రి రమా సురేశ్ రెడ్డి, డాక్టర్ సృజన్, డాక్టర్ శివాని, దివ్య, శ్రీజ, ప్రవళిక, శ్రావణ్, ఇంఛార్జి కమీషనర్ మనోహర్, కౌన్సిలర్లు కుర్ర లింగయ్య, నక్క నాగేంద్ర శంకర్, వీకే. రవి, సీహెచ్‌వో మేరీ సంపూర్ణ, సూపర్‌వైజర్ ఉమాదేవిలతో పాటు తదితరులు పాల్గొన్నారు.

కమాన్‌పూర్, సెప్టెంబర్ 26: కమాన్‌పూర్, గుండారం, పేరపల్లి, జూలపల్లి, నాగారం పంచాయతీల పారిశుధ్య సిబ్బందికి ప్రత్యేకంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారులు రాజమౌళి, మధుసూధన్ శిబిరాన్ని పర్యవేక్షించారు. డాక్టర్లు స్వాతి, సింధూరలతో పాటు వైద్యసిబ్బంది, ఏఎన్ఎంలు ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళా క్యాంటీన్ ఏర్పాటుకు పరిశీలన

సుల్తానాబాద్, సెప్టెంబర్ 26 : జిల్లా వ్యాప్తంగా నాలుగు మహిళా క్యాంటీన్లు ఏర్పాటు చేసేందుకు పరిశీలన చేస్తున్నామనీ ఏపీడీ రవికుమార్ తెలిపారు. సుల్తానాబాద్‌లోని ఎంపీడీవో కార్యాలయ వ్యాపార సముదాయంలో మహిళా క్యాంటీన్ ఏర్పాటు చేసేందుకు పరిశీలన చేశామని తెలిపారు. మరో వారంలో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

పైకప్పు కూలి బొగ్గులో కూరుకుపోయిన కంటిన్యూయస్ మైనర్ యంత్రం

జీడీకే 11గనిలో ప్రమాదం

గోదావరిఖని, సెప్టెంబర్ 26: ఆర్జీ-1 పరిధిలోని జీడీకే -11 గనిలో గురువారం ఉదయం షిఫ్ట్‌లో గని పైకప్పు కూలిన ప్రమాదంలో అత్యంత విలువైన కంటిన్యూస్ మూర్ యంత్రం కూరుకుపోయింది. ఈ ఘటన జరిగిన సమయంలో అక్కడ కార్మికులు లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది.గనిలోని 1సీమ్ ఏ ప్యానెల్ కంటిన్యూస్ మైనర్ యంత్రం 2 రిమోట్ కంట్రోల్ ద్వారా పనిచేస్తున్న క్రమంలో ఒక్కసారిగా పై కప్పు కూలింది. దీంతో అక్కడున్న అధికారులు అప్రమతమయ్యారు. వందల కోట్ల విలువైన కంటిన్యూయస్ యంత్రం బొగ్గులో కూరుకు పోవడంతో అధికారులు యంత్రాన్ని బయటకు తీయడానికి ప్రయత్నాలు చేస్తున్నారు.

లాభాల వాటా ప్రకటించాలని వినతి

రామగిరి, సెప్టెంబర్ 26: సింగరేణి లో పని చేస్తున్న సులభ్ కార్మికులు, నర్సరీ, ఓబీ కాంట్రాక్ట్ కార్మికులకు కూడా లాభాల వాటా చెల్లించాలని ఐఎఫ్‌టీయూ ప్రధాన కార్యదర్శి ఎ.వెంకన్న కోరారు. ఈ మేరకు సంస్థ డైరెక్టర్ (పా) వెంకటేశ్వరరావుకు గురువారం వినతి పత్రం అందజేశారు.

ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ ఎన్నికలు

పాలకుర్తి, సెప్టెంబర్26: ఫోటో వీడియోగ్రాఫర్ అసోసియేషన్ పాలకుర్తి మండల కమిటీ ఎన్నికలు బసంత్‌నగర్ విమానాశ్రయం వద్ద అధ్యక్ష, కార్యదర్శిలు పోగుల విజయ్, ఇర్ఫాన్ ఆధ్వర్యలో గురువారం నిర్వహించారు. అధ్యక్షుడిగావైద్యనరేశ్, ప్రధానకార్యదర్శిగా మాదాసు భూమయ్య, కోశాధికారిగా సంగెం ప్రకాశ్ ఎన్నియ్యారు. బొల్లు సాయిరాజ్ ప్యానల్‌పై, వైద్యనరేశ్ ప్యానల్ విజయం సాధించినట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. ఎన్నికకు సహకరించిన ఫొటోగ్రాఫర్లకు నూతన అధ్యక్ష, కార్యదర్శులు కృతజ్ఞతలు తెలిపారు.

మెట్ల పై నుండి జారి పడి వ్యక్తి మృతి

ఎలిగేడు:సెప్టెంబర్ 26 :ధూళికట్టకు చెందిన మారం సతీశ్(34) ఈ నెల 21 ప్రమాదవశాత్తు కాలు జారి మెట్ల పై నుండి కింద పడడంతో తీవ్రంగా గాయ పడి చికిత్స పొందుతు మృతి చెందాడు.ఎస్సై శ్రీధర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మారం సతీశ్ ఈ నెల 21 న బిల్డింగ్ మెట్లు ఎక్కే ప్రయత్నంలో కాలు జారి మెట్లపై నుంచి పడడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం కరీంనగర్ దవాఖాకు తరలించగా చికిత్స పొందుతు గురువారం మృతి చెందాడు. భార్య మారం మాధవి పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీధర్ తెలిపారు.

బాలల చట్టాలపై అవగాహన

ఫర్టిలైజర్‌సిటీ, సెప్టెంబర్ 26: గోదావరిఖని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బాలల రక్షణ, సంరక్షణ చట్టాలపై బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో గురువారం అవగాహన కల్పించారు. జిల్లా కోఆర్డినేటర్ బీ ఉమాదేవి, ఆర్ సతీశ్, కౌన్సిలర్లు విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఇక్కడ హెచ్ఎం ఇజ్రాయల్, ఉపాధ్యాయులు గడ్డం జగదీశ్వర్, భూమయ్య, రాజేశ్వరి, శంకరయ్య, రమాదేవి, ప్రేమ్‌కుమార్ ఉన్నారు.

పుట్‌బాల్ విజేత వీకేపీ గని

యైటింక్లయిన్‌కాలనీ, సెప్టెంబర్ 26 : సింగరేణి సంస్థ ఆర్జీ-2 ఏరియా అంతర్గత క్రీడల్లో భాగంగా గురువారం జరిగిన పుట్‌బాల్ పోటీల్లో వకీలుపల్లి గని కార్మికులు విజేతలుగా నిలిచారు. డబ్ల్యూపీఎస్ ఆధ్వర్యంలో క్రీడల కోఆర్డినేటర్ నరేందర్ రెడ్డి అబ్దుల్ కలామ్ క్రీడా మైదానంలో ఓసీపీ-3, వకీలుపల్లి గని కార్మికులకు పుట్‌బాల్ పోటీ నిర్వహించారు.

సెక్యూరిటీ గార్డులకు అండగా ఉంటాం

యైటింక్లయిన్‌కాలనీ, సెప్టెంబర్ 26 : సింగరేణి సంస్థలో పని చేస్తున్న ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులకు అండగా ఉంటామని ఇప్టూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అశోక్ పేర్కొన్నారు. ఆర్జీ-2 ఏరియాలో పని చేస్తున్న ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులను కలుసుకొని మాట్లాడారు. కేంద్రం ప్రభుత్వరంగ సంస్థలను మూసివేసే కుట్రతోపాటు కాంట్రాక్టు కార్మికులకు సైతం జీఓ ప్రకారం వేతనాలు ఇవ్వకుండా అన్యాయం చేస్తున్నని ఆరోపించారు. ఈ నెల 30న తలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. నాయకులు లింగారెడ్డి, రమేశ్, బూక్య రవీందర్, నరేశ్, రాకేశ్, కత్తుల నరేశ్ పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరా సవరించాలి

ఫర్టిలైజర్‌సిటీ, సెప్టెంబర్ 28: ఎఫ్‌సీఐ గౌతమినగర్ హౌసింగ్ సొసైటీ కాలనీలో మంగళవారం జరిగిన విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో కాలనీలోని పలు ఇండ్లలో టీవీలు, ఫ్రిజ్‌లు, ఇతర ఎలక్ట్రానిక్స్ వస్తువులు కాలిపోయాయి. విద్యుత్ సరఫరా లోపాన్ని ట్రాన్స్‌కో అధికారులు గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని హౌసింగ్ సోసైటీ కార్యదర్శి ఎల్‌కే మూర్తి కోరారు. షార్ట్ సర్క్యూట్‌తో ఇండ్లలో జరిగిన నష్టాన్ని ట్రాన్స్‌కో అధికారుల దృష్టికి తీసుకువెళ్లనున్నట్లు తెలిపారు.

సీసీ కెమెరాలు ప్రారంభం

ఓదెల, సెప్టెంబర్ 26: కగన్తర్తిలోని పెద్దమ్మ దేవాలయంలో సీసీ కెమెరాలను సుల్తానాబాద్ సీఐ సుబ్బారెడ్డి గురువారం ప్రారంభించారు. గ్రామ శివారులోని చెరువు సమీపంలో ముదిరాజ్ కులస్తులు పెద్దమ్మ దేవాలయాన్ని నిర్మించుకున్నారు. సీసీ కెమెరాలను ఏర్పాటుకు ముందుకు వచ్చిన ముదిరాజ్ కులస్తులను సీఐ అభినందించారు. కార్యక్రమంలో ఎస్ఐ అశోక్‌రెడ్డి, ముదిరాజ్ కులస్తులు పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్‌కు వినతి

మంథని, సెప్టెంబర్ 26: రెండు నెలలుగా జీతాలు లేక ఇబ్బంది పడుతున్నామని మంథనిలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల పార్ట్ టైం ఉపాధ్యాయులు ప్రిన్సిపాల్ శ్రీనాథ్‌కు గురువారం వినతి పత్రం ఇచ్చారు. ఉన్నతాధికారుల దృష్టికి తమ సమస్యను తీసుకువెళ్లి తమకు వేతనాలు ఇప్పించాలని కోరారు. పార్ట్ టైం ఉపాధ్యాయులు పున్నం, అరవింద్, రమేష్, శ్రావణ్ కుమార్, రాజేష్, రమేష్, రాజమౌళి, రామకృష్ణారెడ్డి, శ్రీనివాస్, అనిత, లింగయ్య, ఆనంద్, రవీందర్, కార్తీక్, సడవలి పాల్గొన్నారు.

మెగా వైద్య శిబిరం

మంథని, సెప్టెంబర్ 26: సేవా పక్ష కార్యక్రమంలో భాగంగా పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ, మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా రెనె దవాఖాన ఆధ్వర్యంలో మంథనిలో మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో వైద్యులు సుధీర్, లక్ష్మీనారాయణలు ప్రజలకు వైద్య పరీక్షలు చేసి, మందులు అందజేశారు. దాదాపు 130 మందికి వైద్య సేవలు అందించారు.

గుంజపడుగులో డీఎల్పీవో పర్యటన

మంథని రూరల్, సెప్టెంబర్ 26: గుంజపడుగులో డీఎల్పీవో సతీశ్ గురువారం పర్యటించారు. పారిశుధ్య కార్యక్రమాలను పరిశీలించారు. సఫాయి మిత్రలకు ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో కార్యదర్శి నరేశ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నవంబర్‌లో రిజిస్ట్రేషన్ బాదుడు!

- భారీగా పెరగనున్న చార్జీలు
- తుదిదశకు చేరిన థర్డ్ పార్టీ ఏజెన్సీ అధ్యయనం

హైదరాబాద్, సెప్టెంబర్ 26 (నమస్తే తెలంగాణ): నవంబర్ నుంచి సవరించిన చార్జీలను రిజిస్ట్రేషన్ చార్జీలను అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తున్నది. వాస్తవానికి వ్యవసాయ, వ్యవసాయేతర, స్థిరాస్తుల రిజిస్ట్రేషన్‌కు కొత్త ధరలను ఆగస్టు 1 నుంచే అమలు చేయాలని భావించింది. ఈ మేరకు స్టాంపులు-రిజిస్ట్రేషన్ల శాఖ జూన్‌లో షెడ్యూల్‌ను విడుదల చేసింది. అధికారులు జిల్లాల్లో అధ్యయనం చేసి ప్రభుత్వానికి జూలైలో నివేదిక ఇచ్చారు. ఈ నివేదికపై ప్రభుత్వం సంతృప్తి చెందలేదు. దీంతో ధరల సవరణ అధ్యయన బాధ్యతలను ఓ ప్రైవేట్ ఏజెన్సీకి అప్పగించారు. రాష్ట్రవ్యాప్తంగా సర్వే నంబర్ల వారీగా భూముల విలువను అధ్యయనం చేసి, ఎక్కడ పెంచేందుకు అవకాశం ఉన్నదో, ఎక్కడ తగ్గించాల్సి వస్తుందో, ఎంత మేర సవరించాలో సూచించాలని పేర్కొన్నది. ఈ మేరకు ప్రైవేట్ సంస్థ అధ్యయనం తుది దశకు చేరిందని రిజిస్ట్రేషన్ల శాఖ వర్గాలు తెలిపాయి. ట్రిపుల్ ఆర్ దక్షిణ భాగం పనులు ప్రారంభం కావడం, ఫ్యూచర్ సిటీ పేరుతో కొత్త నగరాన్ని నిర్మించాలన్న ప్రభుత్వ లక్ష్యాల నేపథ్యంలో వాటి చుట్టుపక్కల ప్రాంతాల్లో భూముల సవరణపైనా అధ్యయనం చేసినట్టు చెప్తున్నారు. వారంరోజుల్లో ఈ నివేదిక ప్రభుత్వానికి చేరనున్నట్టు సమాచారం. ప్రభుత్వం సమీక్ష అనంతరం ఏ స్థాయిలో ధరలను సవరించాలో నిర్ణయిస్తారని చెప్తున్నారు. నవంబర్ మొదటివారంలో పెంపును అమలు చేసే అవకాశం ఉంది. 'ఇది రిజిస్ట్రేషన్ చార్జీల పెంపు కాదు. శాస్త్రీయంగా ధరల స్థిరీకరణ. స్థానిక పరిస్థితులను బట్టి చార్జీలు పెంచాలో, తగ్గించాలో నిర్ణయం తీసుకొని అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తున్నది' అని రిజిస్ట్రేషన్ల శాఖ ఉన్నతాధికారి తెలిపారు.

బది'లీలల'పై కొరడా?

రిజిస్ట్రేషన్ల శాఖలో ఇటీవల బదిలీల్లో జరిగిన అక్రమాలపై చర్యలు తీసుకుంటారని సమాచారం. ఈ బదిలీల్లో అధికార పక్ష నేతలు, ఉన్నతాధికారుల సన్నిహితులకు కోరుకున్న స్థానాలను కట్టబెట్టారని ఆరోపణలు వచ్చాయి. రూ.కోట్ల మేర చేతులు మారినట్టు చర్చ జరిగింది. కొందరు అధికారులే దళారుల అవతారం ఎత్తి పోస్టింగ్‌ల బదిలీలల్లో కీలక పాత్ర పోషించారు. ఈ వ్యవహారంపై రెవెన్యూ శాఖ మంత్రి, సీఎం గుర్రుగా ఉన్నట్టు సచివాలయ వర్గాలు చెప్తున్నాయి. త్వరలోనే చర్యలు తీసుకోనున్నట్టు సమాచారం.

సహకార డెయిరీలకు సమాధి!

- హైదరాబాద్ పాలమార్కెట్‌పై ఆధిపత్యానికి హెరిటేజ్ యత్నం
- సర్కారు ప్రోత్సాహంతో ప్రాంతేతరుల పెట్టుబడులు
- శ్వేత విప్లవానికి బాటలు వేసిన కేసీఆర్ ప్రభుత్వం
- స్వరాష్ట్ర రైతుల పుట్టిముంచుతున్న రేవంత్ సర్కారు
- ఒక్కో లీటర్‌పై రూ.4 నుంచి రూ.7 వ్యత్యాసం
- అదే ధరకు సేకరిస్తే రాష్ట్ర పాడి రైతుకు తీవ్ర నష్టం

ఈ నెల 23న ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడలో రోడ్డుపై పాలను పారపోసి నిరసన తెలుపుతున్న పాడి రైతులు

కరీంనగర్, సెప్టెంబర్ 26 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : పాడి రైతు మెడపై ప్రాంతేతరుల కత్తి వేలాడుతున్నది. స్వరాష్ట్రంలో శ్వేత విప్లవానికి కేసీఆర్ ప్రభుత్వం బాటలు వేస్తే.. కాంగ్రెస్ సర్కారు కుట్రల కారణంగా విజయ డెయిరీతోపాటు మిగిలిన కో ఆపరేటివ్ డెయిరీల మనుగడ కూడా ప్రమాదంలో పడే అవకాశం కనిపిస్తున్నది. ఏపీ సీఎం చంద్రబాబు కుటుంబానికి చెందిన హెరిటేజ్ సంస్థ రాష్ట్రంలో రూ.200 కోట్లకుపైగా పెట్టుబడితో శామీర్‌పేటలో డెయిరీతోపాటు ఐస్‌క్రీం తయారీ ఫ్యాక్టరీని ఏర్పాటు చేయబోతున్నట్టు తెలుస్తున్నది. దీనికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంపూర్ణంగా సహకరిస్తున్నట్టు సమాచారం. రాష్ట్రంలో పాలవిక్రయాల అతి పెద్ద మార్కెట్ హైదరాబాద్. ఇక్కడ రోజుకు 20 లక్షల నుంచి 22 లక్షల లీటర్లకుపైగా డిమాండ్ ఉంది. ఈ డిమాండ్‌కు అనుగుణంగా మార్కెట్‌ను అందిపుచ్చుకోవడంలో విజయ డెయిరీ లాంటివి కాస్త వెనుకబడగా..ఇపుడు ఆ మార్కెట్‌ను ప్రాంతేతర డెయిరీలు ఆక్రమిస్తున్నాయి. హెరిటేజ్, జెర్సీ, అమూల్, నందిని వంటి డెయిరీలు.. స్థానిక డెయిరీలకు మించి మార్కెట్‌లో విక్రయాలు చేస్తున్నాయి. ఒక్క హెరిటేజ్ వాళ్లే రోజుకు హైదరాబాద్‌లో 5 లక్షల లీటర్లకు పైగా పాల విక్రయాలు చేస్తున్నట్టు సదరు రంగంలోని నిపుణులు చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లో ఈ సంస్థ పెట్టుబడులు పెట్టి హైదరాబాద్ మార్కెట్ మొత్తం శాసిస్తే రాష్ట్రంలోని విజయ డెయిరీతోపాటు కోఆపరేటివ్ డెయిరీలైన కరీంనగర్, ముల్కనూరు వంటి వాటి భవిష్యత్‌పై నీలినీడలు కమ్ముకునే ప్రమాదమున్నది.

రైతుల ఆదాయంపై దెబ్బ?

నిజానికి పాడి పరిశ్రమను ఆహ్వానించడం ఎవరూ తప్పుపట్టరు. కానీ సదరు పరిశ్రమతో రాష్ట్రంలోని పాడిరైతులకు వచ్చే ప్రమాదాలను పట్టించుకోకుండా రేవంత్ సర్కారు ముందు కెళ్తున్న తీరుపై విమర్శలొస్తున్నాయి. ఇప్పటికే హెరిటేజ్‌లాంటి సంస్థల దాటికి విజయ డెయిరీ కుదేలవుతుండగా.. ఇపుడు ఇతర కో-ఆపరేటివ్ డెయిరీలకూ ముప్పు పొంచిఉన్నది. దీనికి కారణం తెలంగాణతో పోలిస్తే ఆంధ్రాలో రైతులకు ఇచ్చే ఒక లీటర పాల ధరలో రూ.4 నుంచి రూ.7 వరకు వ్యత్యాసం ఉండడమే. ప్రస్తుతం 3 శాతం ఫ్యాట్ ఉన్న పాలను కరీంనగర్ డెయిరీ లీటర్‌కు రూ. 35.65కు కొనుగోలు చేస్తుండగా.. ఏపీలోని చిత్తూరులో రూ.31.50కు కొనుగోలు చేస్తున్నారు. 3.5 శాతం ఫ్యాట్ ఉన్న లీటర్‌పాలను చిత్తూరులో రూ.33కు కొనుగోలు చేస్తుండగా, కరీంనగర్ డెయిరీ రూ.40.25కు కొనుగోలు చేస్తున్నది. అంటే ఒక్కో లీటర్‌పై రూ.4 నుంచి రూ.7 వరకు తేడా ఉన్నది. అక్కడ తక్కువ ధరకు కొనుగోలు చేసి.. రాష్ట్రంలోని డెయిరీల మార్కెట్‌ను దెబ్బతీసేందుకు సరికొత్త స్కీమ్ పెట్టిలేదా.. ధర తగ్గించి సదరు కంపెనీలు పాలు అమ్మే పరిస్థితులు కనిపిస్తున్నాయి. హైదరాబాద్‌లో ఇప్పటికే పలు పాల కంపెనీలు ఈ తరహా మార్కెటింగ్‌కు పాల్పడుతున్నాయి. ఈ పరిస్థితుల్లో ప్రాంతేతర డెయిరీల పోటీని తట్టుకోవాలంటే రాష్ట్రంలోని కోఆపరేటివ్ డెయిరీలైన కరీంనగర్, ముల్కనూరు డెయిరీలు కూడా రైతుకు ఇచ్చే పాలసేకరణ ధరను తగ్గించాల్సి ఉంటుంది. పాల ధర తగ్గించకపోతే మార్కెట్ విక్రయాల్లో ఈ డెయిరీలు వెనుకబడిపోయే ప్రమాదమున్నది. తద్వారా డెయిరీలే మూతపడే ప్రమాదమున్నది. అదే జరిగితే కరీంనగర్, మూల్కనూరు డెయిరీ పరిధిలోనే దాదాపు 3 లక్షలకు పైగా పాడి కుటుంబాలు రోడ్డున పడే ప్రమాదమున్నది. ప్రాంతేతర డెయి